ఉన్నట్టుండి వెయ్యి ఇనుపచక్రాలు ఒరుసుకున్నంత శబ్దం గుండెను బ్రద్దలుచేసింది—

రైలు తూలింది—

హఠాత్తుగా ఆలోచనా ప్రవాహం తెగిపోయింది.

కా. చక్రం ఒక్కక్షణం నిలిచినట్లనిపించింది.

ప్రళయ ఝంఝా ప్రభంజనం హేళాతిశయంతో వీచింది.

—అంతే తెలుసు కరుణాకరానికి.

ఇంటికి అయిదువందల మైళ్ళ దూరంలో దాదాపు అయిదువందల మంది ఆర్తనాదాలమధ్య అర్ధరాత్రి కళ్ళు విప్పాడు మళ్ళీ.

ఇంకా ఉండుండి చినుకులు రాలుతున్నాయి. కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటికి సాక్ష్యం ఆకాశంలో ఓ మూలన రెండు చుక్కలు కనిపిస్తున్నాయి.

ఎప్పుడో తను రైల్లో ఓ మూల కూర్చొన్న గుర్తు. ఇప్పుడు ఏదో మెత్తటి పరుపుమీద ఉన్నట్లనిపిస్తోంది. శరీరం సగంభాగం పైగా చిక్కటి నీటిలోనికి జారిపోయింది. ముఖం నీటిలో తడిసిపోయింది. ఏం చెయ్యాలో తెలీడంలేదు.

దగ్గర్లో ఎవరివో మాటలు వినిపించాయి.

వెయ్యి గొంతుల రోదన వినిపిస్తోంది.

ఎందుకు ఏడుస్తున్నారు అంతా ? ఎందుకు తనిలా నిద్రపోతున్నాడు ?

దగ్గర్లో వ్యక్తులు ఏదో వెలిగించారు. నీటితో పొరలుకమ్మిన కళ్ళముందు ఏదో దృశ్యం కనిపిస్తోంది. తనకింద ఎవరో మెత్తటి మనిషి శరీరం— తన శరీరం—చిక్కటి నీటిలోకాదు—రక్తంలో—

ఎవరో వంగి జేబులో చెయ్యి ఉంచుతున్నారు. చీకటిలో ముఖం తెలియడంలేదు. కాని పోలీసులాగ ఉన్నాడు—టోపీగుర్తు—

కదలబోతే బలంగా గుంజాడు. ఇంకా బాధను ఊహించలేని నరాలు గిజగిజలాడాయి — 'చుప్' అంటున్నాడు పోలీసు. ఏదో హిందీలో అంటున్నాడు. 'కదిల్తే చంపుతాను. నోరుమూసుకు పడివుండు'—భాష అర్థమవుతోంది. జేబులో డబ్బుదొరికింది—బ్యాటరీలైటు వెలుగులో లెక్కపెట్టుకున్నాడు.

"మన అదృష్టం బాగుంది— నాలుగువందలు" అన్నాడు పక్కవ్యక్తితో.

42 వ పేజీ చూడండి

# మనోవాల్మీకం

కే. వివేకానందమూర్తి



మళ్ళీ దీపం ఆరిపోయింది.

ఇప్పుడు కొంత అర్థమవుతోంది.

ఉన్నట్టుండి ఎవరో స్త్రీ ఏడుస్తోంది హృదయ విదారకంగా.

చెయ్యి కదపాలనిపించింది. కాని భుజం కదిలింది. ఇంత తేలికగా ఉందేం కుడిభాగం? తల తిప్పడానికి శక్తి చాలడంలేదు. కాని ఏదో జరిగింది....?

ఎవరో మళ్ళీ దగ్గరికి వచ్చారు. ఈసారి నిశ్శబ్దంగా చీకటిలో తన ముఖం తడిమారు. అగ్గిపుల్ల వెలిగించారు. ఈసారి గుర్తు తెలిసింది. ఎవరో సైనికుడు.

కిందకి వంగి చూసి 'మర్‌గయా' అంటున్నాడు.

జేబులు వెదుకుతున్నాడు. రెండు జేబులూ వెదికాడు. ఏమీ కనిపించలేదు. విసుగొచ్చింది కాబోలు కోపంతో ఒక్కతోపు తోశాడు. కిందనున్న శవం మీదనుంచి శరీరం పక్కకి దొర్లింది. ఈసారి కుడిభాగం చిక్కటి ద్రవంలో మునిగింది. ఇప్పుడు అర్థమయింది. భగవాన్ ! కుడిచెయ్యి కనిపించడం లేదు.

చినుకులు రాలుతున్నాయి; ప్రకృతి రోదిస్తున్నట్టు....

మళ్ళీ స్పృహతప్పింది కరుణాకరానికి.

* * *

1962 జూలై 23.

తెల్లవారేసరికి దేశంలో ఉన్న పత్రికలన్నీ ఏక కంఠంతో ప్రకటించాయి.

హౌరా వెళ్ళే పంజాబు మెయిల్‌కు దుమ్రాం దగ్గర ప్రమాదం జరిగింది. వందమంది మరణించారు. ఇరవైమంది మరణిస్తున్నారు. మరి ఏభైమంది మరణంలో హోరాహోరి పోరాడుతున్నారు.

ప్రకృతి గుండె పగిలింది.

రోజంతా కుండపోతగా వర్షం కురిసింది.

ఏభైమంది ఆ చీకటిరాత్రి నీటిక్రింద నిద్రపోయారు — తీరని నిద్ర. మరి ఏభైమంది పోయారన్న సాక్ష్యానికి విడి శరీరభాగాలు మాత్రం అక్కడా ఇక్కడా దొరికాయి.

* * *

పాట్నా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పలభై యొక్క మందినిమాత్రం చేర్చారు.

కాలూ, చెయ్యీలేని ఓ ప్రయాణీకుడి జేబులో ఓ ఉత్తరం, డైరీ, రెండుమూడు చిల్లరనాణాలు దొరికాయి. ఆ ఉత్తరంలో భాషను చదవడంకోసం రైల్వేశాఖలో పనిచేస్తున్న రామారావుని రప్పించారు.

ప్రయాణీకుడి పేరు—కరుణాకరం. ఊరు భీమిలి. ఏదో బిస్కట్ల కంపెనీలో ఉద్యోగి — అని మాత్రం తెలిసింది.

పదేళ్ళ అంధ్రరాష్ట్రానికి దూరమయి, ప్రవాసంలో ఉన్న రామారావుకి, ఇంత దూరం వచ్చి, ఇక్కడ చనిపోయిన తన ప్రాంతీయుడి చరిత్ర వింతగా కనిపించింది.

ఎవరో స్త్రీ—సుమిత్ర పేరు—అతనికి రాసిన ఉత్తరం జేబులో ఉంది. రెండురోజుల క్రిందట రాశారు. "మామయ్యాకి— చాలారోజులు ఆలోచించాను. ఇక ఎలా ఆలోచించాలో తెలీడంలేదు నాకు. నా అన్నవాడిని నువ్వు ఒక్కడివే—అంత దూరం వెళ్ళిపోకు. తిరిగి వచ్చెయ్యి. నిన్ను పెళ్ళిచేసుకోవడం కోసమే—సుమిత్ర."



# మనోవాల్మీకం

22—పేజీ తరువాయి

ఆపరేషన్ థియేటర్‌లోకి వెడుతున్న నర్సుని ఆపి, అడిగాడు రామారావు: "నర్స్—ఈ డైరీ దొరికిన పేషంటుని చూశావా నువ్వు?"

ఆగి, డైరీని చూసింది— "అంత గుర్తులేదు సార్. చివరి రెండుగదుల్లో ఇద్దరి గుర్తుమాత్రం తెలియలేదు. ఒకరు స్త్రీ—మరొకడు పురుషుడు."

"అతని వయస్సెంత ఉంటుంది ?"

"దాదాపు ముప్పై ఐదువరకూ ఉంటుందన్నారు డాక్టర్"—వెళ్ళిపోయింది.

ముప్పై ఐదేళ్ల వయస్సులో పెళ్ళి !— రెండవ సారేమో. ఈ సుమిత్ర ఎవరో వంశయంతో పెళ్ళికి సిద్ధపడుతునట్టు కనిపిస్తోంది. పెళ్ళికి ఆలోచన ఎందుకు?— పెళ్ళికి ముందు చేసే ఆలోచనలో అసంతృప్తి, పెళ్ళితర్వాత చేసే ఆలోచనలో ఆశాభంగం సహజం—

డైరీ తీశాడు. ఎర్రటి అట్టతిప్పగానే ఎవరిదో స్త్రీ ఫోటో కన్పించింది. ఈమేనేమో— 'సుమిత్ర'

ఒకప్పుడు ఛార్లీచాప్లిన్ ఓ పట్నానికి వెళ్లాడట. అప్పుడా పట్టణంలో పెద్ద ఉత్సవం జరుగుతున్నది. ఛార్లీచాప్లిన్‌ను అనుకరించినవాళ్ళకు బహుమతి ఇస్తారని తెలిసి చాప్లిన్ వేరే వేషం ధరించి పోటీలో పాల్గొన్నాడట. చివరికి ఛార్లీచాప్లిన్‌కు రెండో బహుమతి లభించిందిట!

ఇ. వి. (బొంబాయి)

అంటే. ముప్పైఏళ్ల ఉంటాయి. ముప్పైఏళ్ల వరకూ పెళ్లికాకుండా ఉండిపోయిందా ?—పేజీలు తిప్పాడు. చాలాచోట్లకు కాగితాలు ఖాళీ. మధ్య మధ్య పద్యాలు. ఏవో గుణింతాలు. నాలుగురోజుల నుంచీ వరసగా డైరీ రాస్తున్నాడు. కుదురుగా, చక్కటి రాత. రాత చూస్తుంటే మనిషిలోని నిదానం, శ్రద్ధ, పట్టుదల, సౌమ్యత అర్థమవుతోంది. చదివాడు రామారావు.

జూలై 19 : ఆత్మహత్యా !— అమ్మో. నాకు సాధ్యంకాదు.

జూలై 20 : ఇక్కడకు వచ్చాక ఇంతదూరం ఎందుకువచ్చానా అనిపిస్తోంది. ఆ ముగ్గురే ఎప్పుడూ గుర్తుకొస్తున్నారు. పిల్లల్ని వదిలిపోవడం అంత సులువూకాదు, మంచిదీకాదు—

జూలై 21 : నాకు తెలుసు. సుమిత్ర ఉత్తరం రాస్తుందని. పెళ్లిచేసుకుంటోందట. నామీద అభిమానం లేకపోతే పోనీ — కృతజ్ఞతన్నా ఉంది. పిల్లలకోసం కాకపోతే సుమిత్ర ఎందుకూ నాకు?

జూలై 22 : పోవాలి; పోవాలి. ఇక్కడ ఉంటే పిచ్చెత్తుతుంది నాకు. నా టెలిగ్రాం రాత్రికే చేరుతుంది. నేను సాయంకాలం రైలులో, వాళ్ళముగ్గురికీ నే నొస్తున్నట్టు తెలుస్తుంది— సుమిత్రకీనూ. నలుగురూ స్టేషన్లో నాకోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తూ నిలబడతారు. భగవాన్ ! ఆత్మహత్య చేసుకోవాలనే నా దౌర్బల్యాన్ని పోగొట్టినందుకు నీకు పదివేల జోహార్లు! కాని ఇది రాసిన రెండు మూడు గంటల్లో ప్రమాదం—

"డాక్టర్ ! కరుణాకరం బ్రతుకుతాడా ?"

డాక్టరు ఆగాడు: "మీ కేం బంధువా అతను?"

"కాదు డాక్టర్. నేను రైల్వే ఉద్యోగిని. ఇతని ఉత్తరాలు చదవడానికీ, గుర్తుపట్టడానికీ పిలిపించారు. అతని బంధువులకి టెలిగ్రాం పంపాం. బ్రతుకుతాడా పేషెంటు ?"

"సారీ. ఇంతవరకూ తెలివి రాలేదు — నా కేం నమ్మకంలేదు—"

పాపం ! పాపం !

ఆత్మహత్యనుండి బయటపడే ఆశ కనిపించాక అనుకోకుండా దుర్మరణం. తెలియని ఆ వ్యక్తికోసం రామారావు మనస్సు రెపరెపలాడింది. ఆపరేషన్ థియేటర్‌ముందు డైరీ పట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు.

* * *

సాయంకాలం చీకటి పడేవేళకి వాళ్ళొచ్చారు.

ఆసుపత్రి అంతా గందరగోళంగా ఉంది. ప్రతి క్షణానికీ ఒకరిద్దరు చచ్చిపోతున్నారు. ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టలాడుతూ కొన్ని కుటుంబాలు ఆసుపత్రి వసారాలో తపస్సు చేస్తున్నాయి—

ఆ దారుణాన్ని యింకా మరిచిపోలేక, తట్టుకోలేక నర్సులు కళ్ళుతుడుచుకొంటున్నారు. అవధులు దాటిన విషణ్ణతతో మూగవోయిన వైద్యులు మొండిధైర్యంతో పనిచేస్తున్నారు.

వాళ్లను చూసి ఆపరేషన్ థియేటర్ ముందు కునుకుతున్న రామారావు, ఉలిక్కిపడి లేచాడు.

"మీరేనా సుమిత్ర అంటే ?"

ఆమె తల ఊపింది—

పక్కన ఎవరో ఉన్నారు. "ఎక్కడ ఉన్నారాయన ?" అని తొందరపడుతున్నా డతను. యువకుడు; పన్నటి మనిషి; ఆత్రుతతో, ఉద్రేకంతో ఊగిపోతున్నాడు. ముగ్గురు పిల్లలూ కనిపిస్తారేమో అని చుట్టూ వెదికాడు రామారావు—

"డాక్టర్ వచ్చేవరకూ కాస్త ఆగాలి. పేషెంటు ఇంతవరకూ కళ్లిప్పలేదు. కాస్త స్థిమితపడండి."

ఏం చెప్పాలో తెలీడంలేదు. ఏదో నిద్రలోలాగ మాటలు పేరుస్తున్నాడు. జీవిత సర్వస్వాన్ని కోల్పోయిన వ్యక్తులకి మాటల ఉపశమనం ఎట్లా సరిపోతుందన్న ఆలోచన మాట్లాడనివ్వడంలేదు. నర్సు వచ్చింది. వెళ్లవచ్చునంది. ఒక్కక్షణం వ్యవధి లేకుండా ఇద్దరూ లోపలికి వెళ్లారు. రామారావూ లోపలికి వచ్చాడు.

గది మధ్య ఉన్న పొడవుపాటి బల్లమీద పడుకొని ఉన్నాడు కరుణాకరం, నిద్రపోతున్నట్టు — పోయిన కాలూ, చెయ్యీ కనిపించకుండా నల్లటి దుప్పటి పంటినిండా కప్పారు. ముఖాన్ని దూదితో తుడిచిన రక్తపు చారలు మాత్రం తెలుస్తున్నాయి. విశాలమైన ముఖం ఏదో ఆలోచిస్తున్నట్టు, గొప్ప ఆనందానికి స్థిరపడుతున్నట్టు—

ముఖం చేతుల్లో కప్పుకొని నిశ్శబ్దంగా ఏడుస్తోంది ఆమె. రామారావు చూశాడు. ఇరవై దాటి ఉండదు ఆమెవయస్సు. మనిషి చాలా అల్పం. డైరీలో

ఉన్న ఆమెకూ ఈ విడకూ పోలిక పోనిలేదు. వన్నగా పీలగా ఉంది—

రామారావుతోపాటు యువకుడు బయటికి వచ్చాడు.

వస్తూనే అతను వేసిన మొదటి ప్రశ్న :

"కరుణాకరం బతుకుతాడంటారా ?" అంటూ 'బతకడుకద !' అన్న ధోరణిలో అడిగాడు.

రామారావు తల యెత్తాడు. ఆతృతతో సమాధానానికి ఎదురుచూస్తున్న ముఖం కనిపించింది— "మీరు ?"

"నన్ను సీతాపతి అని పిలవండి చాలు. అతని విషయం మొదట చెప్పండి......"

"బతకడని డాక్టరుగా రన్నారు. ఇంతవరకూ కళ్ళు తెరవలేదు—"

"బతకడు; బతకడు. నేనదే అనుకున్నాను" అన్నాడు సీతాపతి ఉత్సాహంగా. అతని ముఖంలో ఆకస్మికంగా కనిపించిన సంతోషం, తృప్తి చూసి దిమ్మరపోయాడు రామారావు.

"బతక్కపోతే విచారం లేదా మీకు ?"

"ఛాప్! — ఇట్లాంటి ఫూల్స్ బతక్కపోవడంవల్ల దేశానికి నష్టంలేదు. అప్పుడప్పుడు వీళ్ళ కోసం ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండాలని నా..." రామారావు ముఖం చూసి ఆగిపోయాడు.

సీతాపతిమీద కోపం, అసహ్యత ఆ మాటల్తో కలిగింది రామారావుకి. అతని ఆశ్చర్యానికి సమాధానంగా సీతాపతి నవ్వుతున్నాడు.

"క్షమించండి. నేను దుర్మార్గుడిని అనుకునేరు. నేను కొస్త ఉద్రేకిని. కరుణాకరం కథ వింటే అతను చచ్చిపోవడమే మంచిదని మీరూ నిర్ధారణకు వస్తారు."

ఆ ధోరణి రామారావుకి నచ్చలేదు. పాయం కాలం వరకూ ఇలాంటి వ్యక్తుల కోసమా తాను వేచి ఉన్నా డనిపించింది. సానుభూతి కావలసిన వ్యక్తులు అంత దూరం నుంచి వస్తే, తమ భాష తెలిసి, తమని ఓదార్చేవారు అవసర మవుతారని ఆగాడు రామారావు. చివరికి ఈ విస్మయపాటు విదురయింది.

"కరుణాకరంగారు ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు ?"

"సిగరెట్లు కావాలి; పదండి అలా బయటికి వెళ్ళి వద్దాం" అన్నాడు సీతాపతి, ఏదో పెద్ద కథకు ఉపోద్ఘాతం ప్రారంభిస్తున్నట్లు.

"ఆమె ......"

"ఆమె కేం భయంలేదు. కాస్త ఒంటరిగా ఉంటే ఘోరమని ఏడ్చే అవకాశం ఉంటుంది. తరువాత చక్కగా స్థిమితం ఏర్పడుతుంది" అన్నాడు సీతాపతి.

ఆసుపత్రి బయట వందలాది మంది నిలిచిపోయి ఉన్నారు. ఇంకా చనిపోతూఉన్న ప్రయాణికుల్ని అంబులెన్సులు మోసుకు వస్తున్నాయి. వాళ్ళను తప్పించుకు బయటకు వచ్చాక సీతాపతి మాట్లాడ్డం ప్రారంభించాడు. కరుణాకరం బతక ఉన్న విషయం అతనికి పెద్ద 'రిలీఫ్' గా ఉన్నట్లు కనిపెట్టాడు రామారావు.

"సంవత్సరం క్రిందట కరుణాకరం భార్య చచ్చిపోయింది. ఇతను పూర్తిగా కృంగిపోయాడు. పాత బతుక్కి సాక్ష్యంలాగ ముగ్గురు పిల్లలు మిగిలారు. వాళ్ళని ఎలా పెంచాలో తెలీదు. పెళ్ళాం పోయాక ఈ మేనకోడలు ఒక్కతే బంధువు మిగిలింది. ఇతనికి నలభై వయస్సు. ఈమెకి ఇరవై. ఈ సంవత్సరమంతా పిల్లల్ని సాకుతూ ఈయన దగ్గరే ఉంది. సంవత్సరం అయాక ఏం బుద్ధి పుట్టిందో ఆమెను పెళ్ళి చేసుకుంటా నన్నాడు"—

"ఎవరిని ?"

"సుమిత్రని. ఏభై వేల పై చిలుకు ఆస్తి ఉంది. దానికి తోడు ఈ ముగ్గురు పిల్లలు. ఆస్తిని చూసి ఈ ముసలి మొగుణ్ణి, పిల్లల్ని భరించాలి. ఎంత 'రిచెడ్ లైఫ్' ఊహించారా ?"

"ఆమె ఏమంటుంది ?"

"మొదట తెల్లబోయింది. తికమక పడింది. ఏమీ చెయ్యలేకపోయింది. అతని పెళ్ళి ప్రసక్తి రాకముందు మే మిద్దరం పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం."

"మీరు ?"

"నేను ఆమె స్నేహితుణ్ని. ఇంటి పక్కనే ఇల్లు. ఎక్కడో దూరాన బంధుత్వం ఉందట. నాకు తెలీదు. ఇద్దరం కలిసి చదువుకున్నాం. కాని మధ్యలో ఈ కరుణాకరం వ్యవహారం వచ్చిపడింది."

"పెళ్ళి చేసుకొంటే కాని, వీల్లేదని పట్టుపట్టి చేశారా ఆయన ?"

"వాడి మొహం !—వాడికంత ధైర్యం ఎక్కడిదీ ? పట్టి పిరికిసంద. చేసుకోనంటే పిల్లల్ని వదిలి, ఆమెని వదిలి, ఆస్తినంతా ఆమెకే రాసి

---

రాముం : ఇంతకీ యిది నా ఫోటోనా?

ఫొటోగ్రాఫర్ : ముక్కు—కాస్త టచ్ చేశానండీ...కంఠం మీదే.

రాజా (ఉరట్ల)

---

పెట్టి రాత్రికి రాత్రి పట్నాకు పారిపోయాడు. అంతా గాభరాపడ్డాం. చచ్చిపోయాడనే అనుకున్నాం. అంత పని చెయ్యడానికీ చేవ కావాలి. అంత నిర్దాక్షిణ్యంగా పిల్లల్ని వదిలిపోయినందుకు సుమిత్రకి కోపం వచ్చింది, విసుగేసింది—"

సిగరెట్టు కాల్చడం అయిపోయింది. లోపలికి నడుద్దామన్నాడు సీతాపతి. "హఠాత్తుగా కరుణాకరం దగ్గర్నుంచి ఓ రోజు సుమిత్రకు ఉత్తరం వచ్చింది. అప్పట్నుంచీ ఆమె పూర్తిగా మారిపోయింది."

"అంటే ?"

సీతాపతి నిజంగానే ఉద్రేకి. తనకి యిష్టం లేని విషయాలు చెప్పేటప్పుడు పెదాలు కూడా వణుకుతాయి. జేబుల్లో చేతులు ఉంచి ముందుకు దూకినట్లు నడుస్తూ మాట్లాడాడు:

"ఉత్తరం చూడగానే ఆమె రాత్రికి రాత్రి ఒక నిశ్చయానికి వచ్చింది. అతన్ని పెళ్ళి చేసుకుంటానని నిర్ణయించుకొంది. ఎన్నో విధాలుగా నేను చెప్పాను. కాని పెళ్ళిచేసుకోక తప్పదంది. ఎందుకు తప్పదో అర్థంకాదు." ఏదో ఆలోచిస్తున్నట్లు నడిచాడు. అంతలో ఆగి—"అసలు ఇందులో ఓ రహస్యం ఉంది—నిజానికి ఆవిడకీ ఈ పెళ్ళి యిష్టంలేదని ముఖం చూడగానే అర్థమవుతుంది. కాని మనిషిలో పట్టుదల హెచ్చు. అతనంటే ప్రేమ కాదు—కృతజ్ఞత అంటుంది—ఏమిటో పిచ్చి"—

సీతాపతి ఒక్క క్షణం మాట్లాడలేదు. ఎదురుగ్గా ఆపరేషన్ థియేటర్ ముందు సుమిత్ర మోకాలమీద తల ఆనించుకు కూర్చొంది. మళ్ళీ హఠాత్తుగా అడిగాడు సీతాపతి: "కరుణాకరం చచ్చిపోతాడని మీకు రూఢిగా తెలుసుకదూ ?"

తలూపాడు రామారావు.

పెద్ద విశ్రాంతి లభించినట్లు నిట్టూర్చాడు సీతాపతి. "నాకు సంతాపాన్ని, విచారాన్ని నటించడం రాదు సార్—వార్తలన్నీ ఓసారి టూర్ చేస్తాను. మీరే ఆమెకో రెండు మాటలు చెప్పండి—" అని ఇటు తిరిగాడు. తనకీ యిక అక్కడ ఉండాలనిపించలేదు; రామారావుకి. వీలయినంత త్వరగా బయటపడాలనిపించింది. తను అనుకొన్నట్లుగా ఈ వ్యక్తులు లేరు—

దిగాలపడి నిశ్చలంగా కూర్చొంది సుమిత్ర. రామారావు తనని తాను పరిచయం చేసుకున్నాడు. నమస్కారంచేసి పక్కకు జరిగింది—

"పిల్లల్ని తీసుకురాలేదా ?" అని అడిగాడు రామారావు.

కళ్ళు పెద్దవి చేసి చూసింది. "ఏ పిల్లలు ?"

"ఆయన ముగ్గురు పిల్లలు."

"లేదు. భయపడతారని వదిలేశాను."

డైరీలో ఫోటో చూపించి, "ఈవిడ కరుణాకరంగారి భార్యేనా ?" అన్నాడు.

"అవును. అది మామయ్య డైరీ." అంది దాన్ని చూస్తూనే. ఆమె చేతి కిచ్చాడు. "ఇది ఆయన జేబులో దొరికింది. అదికాక మీరు ఆయనకి రాసిన ఉత్తరం కనిపించింది—ఈ రెండూ చూశాకనే ఆయన విషయం తెలిసింది"—

ఆమె ఏమీ మాట్లాడలేదు. నిశ్చలంగా నేలవైపే చూస్తోంది. ఎక్కువగా ఏడ్చినట్లు లేదు.—లేక గుండె పగిలేట్లు రోదించాక ఏర్పడిన నిశ్శబ్దమేమో అది.

"డాక్టరు ఏమన్నారు ?" అనడిగింది కాస్సేపటికి.

"ఏమీ చెప్పలేకపోతున్నారు. ఇంతవరకూ మనిషిలో చలనం లేదు. బతికితే అదృష్టమే."

ఆమె ఇంకేం మాట్లాడలేదు.

"మీరు పెళ్ళి చేసుకుంటానని ఉత్తరం రాయకపోతే ఆయన ఆత్మహత్య చేసుకునేవారేమో. ఆ ఉత్తరంవల్లే బయలుదేరారు. ఇది ఆత్మహత్య కన్నా ఘోరం"—

స్తబ్ధుగా ఉండిపోయింది ఆమె.

ఇంకా సీతాపతి మాటలు గుర్తుకొస్తున్నాయి. "ఒక్క విషయం చెప్తారా ?" అనడిగాడు రామారావు.

ఆమె తలెత్తింది.

"అతన్నెందుకు పెళ్ళి చేసుకోవా లనుకున్నారు మీరు ?"

ఆమె నివ్వెరపోయింది.

"క్షమించండి. తప్పనిసరిగా ఆయన డైరీ చదవవలసివచ్చింది. ఇక్కడ ఉన్న ఒకేఒక్క తెలుగువాడిని నేను. మీకు చెప్పాలని లేకపోతే వద్దు. కాని ఇందువల్ల మీకు తీరని నష్టం కలిగిందని మాత్రం అర్థమయింది. సానుభూతి [illegible]"

డాక్టర్ వృత్తి చేయండి



విరామకాలంలో ఇంటిలో పోస్టల్ ట్యూషన్ద్వారా హోమియోపతి చదివి, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి.
ప్రాస్పెక్టస్ ఉచితం. వెంటనే వ్రాయండి.
Indian Homoeopathic College,
(APW), JULLUNDUR CITY

శుక్లనష్టము, అతిస్వప్నము, ధాతుదౌర్బల్యము, నరముల బలహీనత, శరీర కృశత్వము, దడ
**వాజీప్రభ** (బంగారు చేరినది)
హరించి వీర్యవృద్ధి గలిగించు రసాయనం.
సీసా రు. 5/— పోస్టు ఖర్చులు రు. 1–25అదనం.
**మకరధ్వజతిల్ల** (పై మర్దనకు)
అంగనరములు బలహీనత చెంది నప్పగిల్లినచో
సీసా రు. 6/- స్పెషల్ రు. 10/-పోస్టేజి1-25
**చరకాశ్రమం ఫార్మసీ** (ఫోన్: 2240).
గిరి వీధి, సత్యనారాయణపురం— విజయవాడ—3.

**నెర్వోటాల్**
నరముల బలహీనతకునూ, రక్తపోటుకున్నూ రామబాణము. అనుభవ యుక్తముగా చేయబడినది.
8 ఔ. సీసా 5–75, పోస్టేజి 1–75.
**ఇండియన్ మెడిసన్ హౌస్,**
**విజయవాడ-2.**

# H.M.V.వారి
# "షెర్పా"
నాణ్యమైన *4 Speed*
"రికార్డు ప్లేయర్"
AC మరియు బ్యాటరీలలో లభించును
ధర. ACరు.215/-; బ్యాటరీ రు.185
(ఎక్సైజ్, స్థానిక పన్నులు అదనం)
మావద్ద L. P. &E. P. ఇండియన్/ యింటర్నేషనల్ గ్రామఫోను రికార్డులు లభించును.
**మాధవ & కో.**
పార్కురోడ్ _ విజయవాడ.1

# మనోవాల్మీకం

ఎటువేపో చూస్తూ అంది : "నేను పెళ్ళి చేసుకోకపోతే మావయ్య చచ్చిపోతాడు. చేసుకుంటే సీతాపతికి పిచ్చెత్తుతుంది—ఏం చెయ్యాలో తోచ లేదు—" ఆగిపోయింది.

ఈ సంఘటన ఒక సమస్యను తీర్చిన విశ్రాంతి (రిలీఫ్) — ఆమె ముఖంలో కనిపిస్తుందని అని వెది కాడు. కాని ముఖం నీడవేపు ఉంది. ఆ భావం కనిపించేదేమో మరి.

"ఆయన పట్ల కృతజ్ఞతతో ఒప్పుకున్నారని డైరీలో వ్రాశారు." ఆమె మళ్ళీ ఆశ్చర్యపడింది. "అవును. నా తమ్ముడికి చదువు చెప్పించాడు మావయ్య. బతికున్నంతవరకూ నాన్నకి డబ్బిచ్చాడు. తమ్ముణ్ని విదేశాలకు పంపాడు. దీనికి ప్రతిఫలంగా ఆమాత్రం చెయ్యలేకపోతే ఎలాగ ?"

అర్థమయింది. బాధ్యత కనక పెళ్ళికి సిద్ధపడింది. బాధ్యత కాకపోతే ?—ఆ ప్రశ్నలో సమాధానం ఉంది.

రామారావు లేచాడు. "పాపం. మీకు తీరని దుఃఖం కలిగింది. విచారించకండి. ఏం చేస్తాం ?" అన్నాడు. ఆమె తలయెత్తి అతనివేపు చూసింది— "నిజానికి దుఃఖం లేదు నాకు. విచారం అంతకన్నా లేదు. చచ్చిపోవడానికి ఇంత దూరం వచ్చి, ఇలా చచ్చిపోయాడేమో అని విస్తుపోతున్నాను—"

అతని మనస్సు చివుక్కుమంది.

మనస్సులో ఆ భావం ఉందని అర్థమవుతోంది. కాని మాటల్లో చెప్పడం బాగులేదు.

"మీకు తెలుసా ? — ఆయనకు ఓ కాలూ, చెయ్యీ పోయాయి."

ఆమె ఉలిక్కిపడింది. "నిజం !"

"అవును. ఎలాగూ బతకడని డాక్టర్లు చెప్పేఉండరు. బతికిఉంటే ఆ లోపాన్ని కూడా భరించి ఉండాల్సింది మీరు. వస్తాను. నమస్కారం."

ఆమె దిగ్భ్రమనుంచి తేరుకోకముందే రామారావు బయలుదేరాడు. నిజమే. కరుణాకరం పోవడమే మంచిదయింది. బతికిఉంటే తనమీద ఎవరికీ ప్రేమలేని విషయం అర్థమయేది. అప్పుడు అంత నరకం మరొకటి ఉండదు. చచ్చిపోయినా ఎవరూ విచారించని వ్యక్తి—ఈ నూరుమందిలో తనొక్కడేనని అనుకున్నాడు రామారావు. వచ్చిన ఇద్దరిలో ఒకరికి అతన్ని చూస్తే ఆశ్చర్యం, మరొకరికి ఆనందం కలిగింది. నవ్వొచ్చింది. ఏదో వాక్యం గుర్తుకొస్తోంది — 'అతను చచ్చిపోయాడు కనక బతికాడు. బతికితే చచ్చిపోయేవాడే !'

ఆసుపత్రి వరండా దాటబోతూంటే హఠాత్తుగా వెనక పెద్ద అలజడి వినిపించింది.

వెనక్కి తిరిగితే నర్సు పరుగెత్తుతోంది. ఆత్రంగా అడిగాడు : "ఏమిటి నర్స్ అది ?"

"చివరి పేషెంట్ ఊపిరి తిరుగుతోంది. బతుకవచ్చు నంటున్నారు డాక్టర్ ....." నర్సు ఊపిరి తిరగడంలేదు. థియేటర్ వేపు పరిగెత్తింది.

ఉలిక్కిపడ్డాడు రామారావు. ఆలోచనలు ఒక్కసారి నిలిచిపోయాయి. వెనక్కి పరిగెత్తాడు. మరో మూలనుంచి సీతాపతి హడావుడిగా వస్తున్నాడు. సుమిత్ర లేచి నిలబడింది. తనొక్కడినే ఆపరేషన్ థియేటర్‌లోనికి రానిచ్చారు. ఆక్సిజన్ సిలెండర్లు ఏర్పాటు చేస్తున్నారు. కరుణాకరంలో క్రమంగా చలనం వస్తున్నట్టుంది—

అవును. విచిత్రం !— కరుణాకరం బతుకుతున్నాడు.

కాలూ, చెయ్యీ లేని కరుణాకరం, అతని బతుకును ఎవరూ కాంక్షించని కరుణాకరం బతుకుతున్నాడు.

బతికిఉంటే బాగుండునని ఏడ్చే తొంభై తొమ్మిదిమంది చచ్చిపోయారు. చచ్చిపోయినా విచారించని ఒక్క వ్యక్తి బతికాడు.

ఉన్నట్టుండి ఆపరేషన్ థియేటర్ బయట ఎవరో కెవ్వున కేకవేశారు. పదిమంది ఆత్రంగా ఏదో మాట్లాడుతున్నారు. ఆపరేషన్ థియేటర్ లోనివారంతా ఆ కేకకి అదిరిపడ్డారు. మరి ఇద్దరు నర్సులు అకస్మాత్తుగా గదిలోనికి దూసుకువచ్చారు.

"డాక్టర్! డాక్టర్! — ఎదుటి బల్లమీద కూర్చున్న అమ్మాయి హార్టు ఫెయిలయింది—" రామారావు ఉలిక్కిపడ్డాడు. ఒక్క దూకుతో బయటికి వచ్చాడు.

అవును — సుమిత్రను పదిమంది పట్టుకున్నారు. సీతాపతి చిన్నపిల్లాడిలాగ ఏడుస్తున్నాడు. మరో డాక్టరు వచ్చి ఆమెను పరీక్షిస్తున్నాడు.

కుంటి, మునలి భర్తతో జీవితాంతం కాపరాన్ని ఆ బలహీనపు మనస్సు ఒక్క లిప్తకాలం ఆలోచించి ఉంటుంది; అది చాలు గుండె పగలడానికి.

సందేహం లేదు — సుమిత్ర చచ్చిపోయింది.

"భరించలేని తట్టుకోలేని షాక్ తగిలింది. గుండె చాలా బలహీనం. చాలా విచిత్రమయిన కేసు" అంటున్నాడు డాక్టరు.

*　　*　　*

ఆపరేషన్ థియేటరులో కరుణాకరానికి తెలివొచ్చింది—

గడియారం శబ్దం అతనికి క్రమంగా వినిపిస్తోంది—

మీద వెలిగే దీపకాంతి తెలుస్తోంది.

బలమైన లోషన్ వాసనను మెదడు గుర్తిస్తోంది.

ఎవరివో మాటలు అర్థమవుతున్నాయి.

ఊపిరి తిరుగుతోంది.

కళ్లిప్పితే పదిమంది కళ్ళు ఆత్రంగా తనవేపే చూస్తున్నాయి. రామారావు అసంకల్పితంగా దగ్గరికి జరిగాడు.

"కరుణాకరంగారూ ! ఎలా ఉందిప్పుడు ?"

ఏదో మాట్లాడుతున్నాడు కరుణాకరం. మొదటి ప్రశ్న :

"సుమిత్ర వచ్చిందా ?"

రామారావు తలెత్తాడు. ఒక్క క్షణం అతని మనస్సులో వెయ్యి రైళ్లు పరుగెత్తాయి. తల వంచి చెవులో అన్నాడు. "వచ్చారు కరుణాకరం గారూ—బయట ఉన్నారు. మీరు విశ్రాంతిగా ఉండండి"—

నీరసంగా కళ్లు మూసుకొన్నాడు కరుణాకరం. అతని ముఖంలో తృప్తి, పట్టలేని ఆనందం స్పష్టముగా అర్థమయింది. "నాకు తెలుసు. నన్ను పెళ్లి చేసుకుంటుంది. నామీద అభిమానం ...." అని గొణుగుతున్న మాటలు ఒక్క రామారావుకే అర్థమయాయి.

కరుణాకరంమీద జాలితో రామారావు మనస్సు రెపరెప లాడింది. అప్పుడనిపించింది — నిజంగా పెద్ద ప్రమాదమే జరిగిపోయిందని— ★